

నేడు ఆలయాల్లో గోపూజ

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో బుధవారం గోపూజ తప్పనిసరిగా నిర్వహించాలని మంత్రి రామలింగారెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీపావళి పండుగ, బలిపాడ్యమిని పురస్కరించుకుని గోపూజ జరపాలని సూచించారు. గోవులను అందంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో పూజలు జరిపి బియ్యం, బెల్లం, అరటిపండ్లను ఆవులకు అందించాలని సూచించారు. దీంతో అన్ని ఆలయాల పరిధిలోనూ అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు.

ఆన్‌లైన్‌లోనే ఆర్టీఓ సేవలు



- దళారీ వ్యవస్థకు చెక్
- అరచేతిలోనే 32 సేవలు
- సత్వర సేవల కొరకే మార్పులు: మంత్రి రామలింగారెడ్డి

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖలలో అత్యంత కీలకమైనదీ రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీఓ). ఇతరశాఖలలో ఎప్పుడో ఓసారి పనిపడవచ్చునేమోగానీ ఆర్టీఓ కార్యాలయం అంటే ప్రతి పౌరుడికి తప్పనిసరిగా అవసరం ఉంటుంది. బెంగళూరు లాంటి నగరంలో ప్రతి ఇంటికీ మూడునాలుగు వాహనాలు ఉంటాయి. ఇలా వాహనం నడిపేవారంతా డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొత్త వాహనం కొనుగోలు చేసినా, పాతవాహనం విక్రయించినా ఆర్టీఓ సేవలు అత్యవసరంగా ఉంటాయి. రవాణ శాఖ అంటే కాసులు కురిపించే విభాగంలో ఒకటిగా పేరుంది. వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పోస్టులంటే ప్రాంతాలవారీగా డిమాండ్ ఉంటుందనేది తెలిసిందే. ఆర్టీఓ కార్యాలయానికి నేరుగా వినియోగదారుడు వెళ్లే పరిస్థితి ఉండదనే చెడ్డ పేరు ఉంది. అంతా బ్రోకర్ల కనుసైగలలోనే పనులు జరుగుతాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి ఆర్టీఓ కార్యాలయానికి అనుబంధమైన ప్రాంతాలలో బ్రోకర్లు కూడా చిన్నపాటి ఆఫీసులను ఏర్పాటు చేసుకుని అవకాశాన్ని బట్టి సేవలందిస్తుంటారు. ఎల్‌ఎల్‌ఆర్, లైసెన్స్‌ల విషయంలో వివాదాలు లేకుండా పని జరగాలంటే మధ్యవర్తులను ఆశ్రయించడం సముచితమనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇదేదో ఇటీవల కొంతకాలంగా తెరపైకి వచ్చిన అంశం కాదు. ఆర్టీఓ వ్యవస్థ ప్రారంభమైన 70ఏళ్లుగా ఆర్టీఓ కార్యాలయాల వద్ద బ్రోకర్లు కూడా ఉంటున్నారు. ఇటీవల డిజిటల్ వ్యవస్థ రావడంతో ఆన్‌లైన్ పట్ల అవగాహన కల్గిన వారు వారి పనులను దళారులతో సంబంధం లేకుండానే పనులు చేసుకుంటున్నారు. అయినా బ్రోకర్లను పూర్తిగా నియంత్రించే విధానం ఇంకా రాలేదు. అయితే ప్రభుత్వం ప్రజలకు కీలకసేవలు అందించే రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయాలలో మధ్యవర్తుల ప్రమేయాన్ని స్వస్తి పలికేందుకు సిద్ధమైంది.

అడుగడుగునా కెమెరాలు

ప్రైవేట్ వ్యక్తుల చర్యలకు వందశాతం నియంత్రించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆర్టీఓ కార్యాలయాలలో ప్రైవేట్ వ్యక్తులు, ఏజెంట్లు లేకుండా చేయదలిచారు. అన్ని ఆఫీసులకు సీసీ కెమెరాలను అమర్చనున్నారు. డీఎల్, ఆర్‌సీ కార్డులను తప్పనిసరిగా స్పీడ్‌పోస్ట్‌లో పంపాలనే నిబంధన ఉంది. కానీ సక్రమంగా అమలు చేయడం లేదు. వాహనం రిజిస్ట్రేషన్‌కు ఆర్టీఓ ఫీజు, హైపొథికేషన్ ఇతర సర్వీసులలో ఏజెంట్ల వద్దకే వెళ్లేలా వాహనాల విక్రేత కంపెనీలు సూచిస్తున్నాయి. మీరు పదే పదే తిరగలేరని, అన్నీ వారే చూసుకుంటారని నమ్మబలుకుతారు. ఇక వాహనదారులు కూడా అక్కడికి నేరుగా వెళ్తే ఇబ్బంది కలిగిస్తారనే వెనుకడుగు వేస్తున్నారు. ఆర్టీఓ కార్యాలయాల సమీపంలో జిరాక్స్ దుకాణాలు, టీ స్టాల్స్ తదితర చిన్నపాటి దుకాణాలు వ్యాపార లక్ష్యం కాకపోయినా ఏజెంట్లకు అడ్డాలుగా మారిపోయాయి. ఇలా ప్రతి కార్యాలయం పరిధిలోనూ కనీసం 15-25దాకా దుకాణాలు వెలుస్తున్నాయి. ఆన్‌లైన్ సేవలతో దళారుల వ్యవస్థకు బ్రేక్ పడనుంది. అసలు దళారులను కార్యాలయాల్లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ప్రజలు కూడా నేరుగా అధికారులనే కలవాని సూచిస్తున్నారు.



జ్ఞానభారతిలోని ఆర్టీఓ కార్యాలయం

ఏజెంట్లకు నో ఎంట్రీ

రవాణాశాఖ ఆన్‌లైన్‌లోనే 32సేవలను అందించనుంది. వాహనదారులు, వారితోపాటు వచ్చే సన్నిహితులు, ఆర్టీఓ ఉద్యోగులు మినహా కార్యాలయాల పరిధిలో కనిపిస్తే సంబంధిత ఆఫీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో ఆర్టీఓ కార్యాలయాలలోని బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌లు, సూపరింటెండెంట్‌లు అప్రమత్తమయ్యారు. ఎవరి కోసమో మేమెందుకు విధి నిర్వహణలో చెడ్డపేరు తెచ్చుకోవాలనే ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. కొన్ని కార్యాలయాలలో ఏజెంట్లు సైతం ఉద్యోగుల తరహాలో పనిచేస్తున్నట్లు ఉన్న ఆరోపణల మేరకు అటువంటి విధానాలకు చెక్ పెట్టదలిచారు. కార్యాలయంలో కౌంటర్లలోనే కూర్చుంటే సందర్శకులు ఉద్యోగులు లేదా అధికారులుగా భావిస్తారు. ఇదే అవకాశంగా తీసుకుని అత్యధిక సొమ్ము డిమాండ్ చేసి అందులో కొంతమేర అధికారులకు వాటా ఇస్తున్నారు. అందుకేవారు బహిరంగంగానే ఎటువంటి జంకు లేకుండా హల్‌చల్ చేస్తున్నారు.

దడ పుట్టిస్తున్న దళారీలు



రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ), గూడ్స్ వాహనాలకు అనుమతులు, ఆర్‌సీ డూప్లికేట్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, ఎల్‌ఎల్‌ఆర్, పర్మిట్‌ల రెన్యూవల్, ఆర్‌సీలలో మార్పు, లగ్జరీ ట్యాక్సీలకు అనుమతులు, నేషనల్ పర్మిట్‌లకు అనుమతి, గూడ్స్ వాహనాల పర్మిట్లకు డూప్లికేట్, లగ్జరీ వాహనాలకు పర్మిట్ల అనుమతులు, రెన్యూవల్, కండక్టర్ లైసెన్స్ రెన్యూవల్, డీఎల్ సమాచారం, ఎల్‌ఎల్‌ఆర్ లేదా డ్రైవింగ్ లైసెన్సులలో చిరునామాల మార్పు, ఇతరత్రా మార్పులకు ఆర్టీఓ కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఏజెంట్లను ఆశ్రయించే పరిస్థితి కొనసాగింది. ప్రజలనుంచి అధికంగా వసూళ్లు చేస్తారు. ప్రతి కార్యాలయంలో 10-20 మంది దాకా ఏజెంట్లు ఉంటారు. రూ.500-600 ఫీజు ఉంటే ఐదారువేల దాకా వసూలు చేస్తారు. నేరుగా కార్యాలయానికి వెళ్తే నెలల తరబడి వేచి ఉండాల్సి ఉంటుందనే ప్రచారం చేస్తారు. ఇలా సేకరించిన సొమ్ములో 50శాతం ఏజెంట్ల వాటా ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఏజెంట్ల తాకిడిని నియంత్రించేందుకు ఆర్టీఓ సేవలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి తెచ్చారు. ప్రైవేట్ వ్యక్తులు, ఏజెంట్లు కార్యాలయాలకు రాకుండా నిషేధించారు. కార్యాలయానికి ఏజెంటు వస్తే అధికారిని సస్పెండ్ చేస్తామనే హెచ్చరికలు జారీ చేశారు. రవాణాశాఖలో పనిభారం పెరుగుతోంది. రిజిస్ట్రేషన్‌లతోపాటు ఇతరత్రా సేవలు పెరుగుతున్నాయి. మరోవైపు ప్రతి ఆర్టీఓ పరిధిలోనూ వాహనాలసంఖ్య దశాబ్దాలకాలంగా రెండు మూడింతలు పెరిగింది. పైగా కొన్నేళ్లకాలంగా నియామకాలు జరగకపోవడంతో పనిభారం పెరిగింది. దీంతో ప్రతి కార్యాలయంలోనూ ప్రైవేట్ వ్యక్తుల ప్రభావం కూడా పెరిగింది. రవాణాశాఖ కార్యాలయాలపై ఉన్నతాధికారుల పరిశీలనలు, దాడుల కంటే లోకాయుక్త, ఏసీబీ వంటిబృందాలు చేయడమే ఎక్కువసార్లు వైరల్ అయ్యింది. ఇలా ఏజెంట్ల ద్వారానే దందాగా మారిన రవాణాశాఖలో మార్పులు తీసుకొచ్చేందుకు సంబంధితశాఖ మంత్రి రామలింగారెడ్డి సిద్ధమయ్యారు. అందుకే ఆన్‌లైన్ ద్వారానే సేవలు కొనసాగించాలని తీర్మానించారు. కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్‌సీ రెన్యూవల్, 15ఏళ్లు దాటిన వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహనాల యజమానుల మార్పు, పర్మిట్‌ల వంటి సేవలను సంపూర్ణంగా ఆన్‌లైన్ ద్వారానే కొనసాగించాలని తీర్మానించారు.



అమరులైన పోలీసులకు నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

పోలీసుశాఖతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు

- పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో సీఎం

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖ తోనే సమాజంలో శాంతిభద్రతలు సాధ్యమని, వారే లేకపోతే సమాజ మనుగడ కష్టమని సీఎం సిద్దరామయ్య అన్నారు. మంగళవారం నగరంలో పోలీసు సంస్మరణ దినంలో అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నైతిక పోలీస్ వ్యవస్థకు అడ్డుకట్ట వేసిన ఘనత పోలీసుశాఖకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని సూచించారు. ఏడాదిలో రాష్ట్రంలో 8మంది దేశవ్యాప్తంగా 191మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని వారి బలిదానం వెలకట్టలేనిదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రజలు కాపాడుకునేలా పోలీసుశాఖ నిర్వహిస్తుందన్నారు. 116మందికి కారుణ్యనియామకాలు ఆదేశాలు జారీ చేశామన్నారు. రిటైర్డు పోలీసులకు ఆరోగ్యభద్రత కోసం లక్ష నుంచి రూ.1.50లక్షలకు పెంచామన్నారు. పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు మొత్తాన్ని రూ.1500కు పెంచామన్నారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ సలీం, గ్రేటర్ బెంగళూరు ప్రాధికార స్పెషల్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు కుటుంబీకుల సమస్యలు తెలుసుకుంటున్న సీఎం

యువజంట ఆత్మహత్య
- మృతులు ఒడిశా వాసులు

7

ద్విచక్రవాహనాలు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్

సీఎం సభలో తోపులాట

- 11 మందికి అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా పుత్తూరులో సీఎం సిద్దరామయ్య పాల్గొన్న ఓ సభలో 11మంది అస్వస్థతకు గురయ్యారు. సోమవారం పుత్తూరు ఎమ్మెల్యే అశోక్ రై నేతృత్వంలో 'అశోక్ జనమన' కార్యక్రమం జరిగింది. సీఎం సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుత్తూరులోని తాలూకా క్రీడామైదానంలో జరిగిన సభకు సీఎం ఆలస్యంగా చేరుకున్నారు. దీంతో ప్రజలు గంటల తరబడి వేచియుండాల్సి వచ్చింది. భద్రతా కారణాలతో వాటర్‌బాటిల్స్‌ను ప్రాంగణంలోకి తీసుకెళ్లకుండా నిషేధించారు. ఎండప్రభావంతో తీవ్ర అలసటకు లోనయ్యారు. అంతకుముందు వర్షం కురవడంతో మైదానమంతా బురగా మారింది. కనీసమైన సౌకర్యాలు కూడా కల్పించలేదు. తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లారు. ఒక్కసారిగా బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. 11మంది అస్వస్థతకు లోనయ్యారు. వారందరినీ హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండడంతో మణిపాల్ ఆసుపత్రికి తరలించి ఐసీయూసీలో చికిత్స అందిస్తున్నారు. యోగిత, సభామడావు, అమీనా పాత్రకోడి, నేత్రావతి ఇర్దే, లీలావతి కడబ, వసంతి బల్నాడ్, కుసుమా, రత్నావతి పేరిగేరి, అఫీలా పాత్రకోడి, స్నేహప్రభ, జనీలా అస్వస్థతకు గురైనవారు. గాయపడినవారంతా మహిళలు కావడంతో కుటుంబ సభ్యులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- నలుగురు బీదర్‌వాసుల దుర్మరణం
- ఆలయానికి వెళ్లి వస్తుండగా దుర్ఘటన

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరిగిన ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. సొలాపూర్ జిల్లా హులజంతగి మహాలింగరాయ ఆలయ దర్శనం కోసం వెళ్లి వెనుదిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన మహారాష్ట్ర కారు ఢీ కొనడంతో బీదర్ జిల్లా వాసులు నలుగురు దుర్మరణం చెందారు. దీపావళి పండుగ సందర్భంగా దర్శనంకోసం బీదర్ తాలూకా కాశెంపుర గ్రామానికి చెందిన ఐదుగురు ఒకకారులో వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున వాపసు వస్తుండగా మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్14ఈపీ 0732 నెంబరుగల కారు ఢీ కొంది. ప్రమాదంలో రతికాంత్ (30), శివకుమార్ (26), సంతోష్ (20), సదానంద్ (19)లు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో యువకుడిని ఉర్మార్గ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. మహారాష్ట్రలోని మురుం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మరో కారు ప్రమాదబాధితుల వివరాలు తెలియరాలేదు.



నుజ్జునుజ్జయిన కార్లు

రాష్ట్రమంతటా దీపావళి సందడి

- బాణసంచా కాలుస్తూ నగరంలో 80 మందికి గాయాలు

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రాష్ట్రమంతటా సంతోషంతో చేసుకుంటున్నారు. సోమవారం ప్రారంభమైన దీపావళి వేడుక బుధవారం దాకా కొనసాగనుంది. నరక చతుర్థశి రోజున టపాసులు పేల్చేవేళ ప్రమాదాలు జరిగి సుమారు 80మందికిపైగా గాయపడ్డారు. నగరంలోని మింటో ఆసుపత్రిలో 13మంది, నారాయణ నేత్రాలయలో 51మంది, శంకర కంటి ఆసుపత్రిలో 13మంది, ప్రభా నేత్రాలయలో ఆరుగురు చికిత్సలు పొందుతున్నారు. బాణాసంచా కాల్చేవేళ అజాగ్రత్త కారణంగా ఎక్కువమందికి గాయాలయ్యాయి. కంటికి దెబ్బతగిలినవారు నగరంలోని వివిధ కంటి చికిత్సా కేంద్రాలకు వెళ్లారు. ఇతర గాయాలపాలైనవారు స్థానిక ఆసుపత్రులలోనే చికిత్స పొందారు.



కెంగేరిలో సంబరాల్లో ఓ కుటుంబం



హొసహుడ్య వద్ద పొంగి పొర్లుతున్న కుశావతి నది



వంతెన పైనుంచి పారుతున్న నీరు

పొంగిపొర్లుతున్న కుశావతి నది

చింతామణి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కుశావతి నది పొంగిపొర్లుతోంది. శిడ్లఘట్ట-చేళూరు తాలూకాల్లో రెండు రోజులకుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చింతామణి-చేళూరు మెయిన్‌రోడ్డులోని హొసహుడ్య వద్ద కుశావతి పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడ ఎలాంటి చెక్‌డ్యాం లేకపోవడంతో నీరు దిగువన ఉన్న సరిహద్దులోని టీ సదుం ప్రాంతానికి చేరుతోంది. మెయిన్‌రోడ్డుకు అనుబంధంగా నది కాలువపై బ్రిడ్జ్ ఉంది. ప్రస్తుతం బ్రిడ్జ్‌పై నుంచి ఎక్కి నీరు ప్రవహిస్తోంది. దీంతో సమీప ప్రాంతాల వాసులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీరు వృథా కాకుండా హొసహుడ్యవద్ద ఒక చెక్‌డ్యామ్ నిర్మిస్తే వర్షానికి ఇబ్బందులు ఉండవని, ఎన్నిసార్లు కోరినా నాయకులు, అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నగరంలో మోస్తరు వర్షం

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉన్నట్టుండి వర్షం కురవడంతో నగరవాసులు ఇబ్బంది పడ్డారు. ప్రత్యేకించి కేఆర్ మార్కెట్, చిక్కపేటలో పండుగ కొనుగోళ్లకు వచ్చిన పాదచారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై వర్షంనీటితోపాటు బురద ఉండడం సమస్యగా మారింది. కొంతమంది గొడుగు ఆసరాతో ముందుకు సాగారు.



చిక్కపేటలో గొడుగు సాయంతో వెళ్తున్న యువతులు

బిహార్ ఎన్నికలకు రాష్ట్రం నుంచి సొమ్ము

- ఎంపీ రాఘవేంద్ర ఆరోపణ
- డీసీఎం డీకే శివకుమార్ ఆగ్రహం

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బిహార్ శాసనసభ ఎన్నికలకు కర్ణాటక నుంచి భారీగా నగదు సమకూరుస్తున్నారని శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర ఆరోపించారు. ఈ అంశంపై గడిచిన కొన్నిరోజులుగా రాష్ట్ర రాజకీయాలలో కొనసాగుతోంది. సుమారు 2వేల కోట్ల రూపాయలు సమకూర్చాలని అధిష్ఠానం అల్టిమేటం ఇచ్చిందని అందుకే ఇటీవల సీఎం మంత్రులకు విందు పేరిట టార్గెట్ ఇచ్చారని ప్రతిపక్షనేత అశోక్ ఘాటుగా విమర్శించిన విషయం విదితమే. తాజాగా సోమవారం ఎంపీ రాఘవేంద్ర వ్యాఖ్యలపై డీసీఎం డీకే శివకుమార్ సున్నితంగా మందలించారు. బీజేపీ, జేడీఎస్‌లో కొంతమంది హిట్ అండ్ రన్ నేతలు ఉన్నారని వారి తరహాలో నీవెందుకు వ్యవహరిస్తావంటూ మందలించారు. అయితే ఐటీబీటీశాఖ మంత్రి ప్రియాంకఖర్గే ఎక్స్ ద్వారా మంగళవారం విరుచుకుపడ్డారు. హైకమాండ్‌కు సమర్పణమస్తు చేసిన గొప్ప బీజేపీదే అన్నారు. బీజేపీ హైకమాండ్‌కు రూ.1800 కోట్లు కప్పం ఇచ్చిన విషయం వేదికపైనే యడియూరప్ప, దివంగత అనంతకుమార్ సంభాషణలో బహిరంగమైంది మరచిపోయారా... అంటూనే మరోసారి గుర్తు చేశామన్నారు. బీజేపీలో సీఎం పోస్టుకు రూ.2500 కోట్లు చెల్లించాలని, మంత్రి కావాలంటే రూ.60-70 కోట్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించిన విషయాన్ని ప్రస్తావించారు. బీజేపీ నాయకులు మొదట తమ పార్టీని చక్కదిద్దుకోవాలని తర్వాత విమర్శలకు దిగాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.75	1631.93
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	5.183	36,910
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,202	36,799
నీటి నిల్వ (టీఎంసీలు)	78.97	101.50

1 నుంచి బెంగళూరు-బళ్లారి మధ్య

స్టార్ ఎయిర్ విమాన సర్వీసు



బళ్లారి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బళ్లారి, బెంగళూరు మధ్య స్టార్ ఎయిర్‌వేస్ విమానసర్వీస్ నడపనుంది. బెంగళూరు-బళ్లారి (విద్యానగర్, తెరణగల్‌లోని జిందాల్ విమానాశ్రయం) మధ్య ఈ విమానం నడవనుంది. బళ్లారి నుంచి ఉదయం 7-50 గంటలకు బయల్దేరి బెంగళూరుకు ఉదయం 9-10 గంటలకు చేరుకుంటుందని విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● 37 మంది జూదరుల అరెస్ట్

కంప్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు నగదు స్వాధీనం చేసుకుని, జూదరులను అరెస్ట్ చేశారు. కురుగోడు తాలుకా పరిధిలోని బసాపురం, ఏ వీరాపురం, ఖ్యాదిగహళ్ గ్రామాల్లో సోమవారం రాత్రి పేకాటాడుతున్న అడ్డాలపై సీఐ విశ్వనాథ్ హిరేగౌడ, ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్ప వారి బృందం దాడి చేసి కొంత నగద స్వాధీనం చేసుకున్నారు. 37 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కురుగోడు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ విశ్వనాథ్ హీరేగౌడ, ఎస్ఐ సుప్రీత్, విరుపాక్షప్ప మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి దీపావళి పండుగ సమయంలో భారీగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పండగల పేరుతో ఎక్కడైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో మృతి చెందారు. మంగళవారం బళ్లారిరూరల్ తాలుకాలోని పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల అసుండి గ్రామానికి చెందిన రుద్రగౌడ (45) తమ అక్క లక్ష్మీదేవి అనంతపురం జిల్లా గడేకల్ తమ బంధువులు కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గోడేహాళ్ సమీపంలో గుర్తు తెలియని కారు వెనుక నుంచి రుద్రగౌడ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో రుద్రగౌడ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని చికిత్సని నిమిత్తం అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

● పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ ● వీరులకు ఘన నివాళి



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీ నాగేంద్ర ప్రసాద్, డీఐజీ వర్తిక కటియార్, ఎస్పీ శోభారాణి

బళ్లారి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో అమరవీరుల త్యాగాలు ప్రజలు ఎన్నటికీ మరవరానివని బళ్లారి జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ప్రకృతిని ఎంత ప్రేమిస్తామో అలాగే దేశ సంపద, మానవవులను రక్షిస్తూ అమరులైన వారిని స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. మంగళవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పరేడ్‌లో పోలీస్ గౌరవ వందనం చేశారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి గౌరవవందనం సమర్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ దేశ అంతర్గత రక్షణలో అమరులైన వీరులకు పోలీస్ యూనిఫారం ద్వారా నివాళులర్పించాలన్నారు. బళ్లారి జోన్ డీఐజీ వర్తిక కటియార్ 1958లో లడఖ్‌లోని హట్‌స్ప్రింగ్‌లో చైనా సైనికులతో జరిపిన యుద్ధంలో 10 మంది సేనికులు అమరులయ్యారన్నారు. 1960 అక్టోబరు 21 నుండి పోలీస్ అమర వీరుల స్మారక దినం జరుపుకుంటున్నామన్నారు. ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ పోలీసుల త్యాగాలను, జాతీయ భద్రత, సమగ్రతను కాపాడుకోవడంలో అందరూ చేతులు కలపాలని కోరారు. ఏఎస్పీలు రవికుమార్, ఎస్. నవీన్ కుమార్, జిల్లాలో ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ కానిస్టేబుళ్లు, పారా మిలటరీ బలగాలు పాల్గొన్నారు.



అమరవీరుల స్మారకానికి సెల్యూట్ చేస్తున్న ఏఎస్పీ రవికుమార్

జోరువానతో రహదారుల జలమయం



నగరంలో జోరుగా కురుస్తున్న వర్షం



నిర్మానుష్యమైన రహదారులు

బళ్లారి సిటీ/ గాంధీనగర్/రూరల్, కంప్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బళ్ళారి నగరంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాలువల్లో పూడిక పేరుకు పోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపైనే ప్రవహించింది. నగరంలో రాయల్ సర్కిల్, కెఇబి సర్కిల్, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా వర్షంతో రోడ్లు అన్ని బురద మయం అయ్యాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీపావళి పండుగ సోమ, మంగళవారం రెండు రోజుల పాటు నగర ప్రజలు ఆచరించినా, వర్షంతో పలు చోట్ల బాణసంచా సందడి అరకొరగా కనిపించింది.

సిరిగేరిలో భారీ వర్షం

తాలుకా పరిధిలోని సిరిగేరి గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 3వ వార్డులో చెరువు నీరు వర్షం నీరు కలిసిపోయే వార్డులో ఇళ్లలోకి నీరు చేరాయి. ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నోసార్లు చెరువు విషయమై పంచాయతీ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.



అండర్‌పాస్ వద్ద జల ప్రవాహం



సిరిగేరి గ్రామం 3వ వార్డు రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



బళ్లారిలో వాన నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు



మీడియాతో మాట్లాడుతున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ ఆరోగ్యరాజు

అసలువి చూపి నకిలీవి అంటగడ్తారు

● నకిలీ బంగారం అంట గట్టి, మోసగించిన ముఠాలో ఇద్దరు కర్ణాటక వాసుల అరెస్టు
● తవ్వకాల్లో బంగారం దొరికిందంటూ మాయమాటలు..
● రూ.12 లక్షలు మోసపోయిన గుంటూరు దంపతులు

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం అంటగట్టి కొరిటెపాడుకు చెందిన దంపతులను మోసగించి వారి నుంచి రూ. 12 లక్షలు తీసుకున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఐదుగురు సభ్యుల ముఠాలో ఇద్దరిని గుంటూరు అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోని బళ్ళారి పరిధిలో గల విట్లాపురం పంచాయతీకి చెందిన గుత్తి జంబునాద్ (ఏ4), వెంకటేష్ (ఏ5)గా వారి గుర్తించారు. గుంటూరులో మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల డీఎస్పీ అరవింద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... ఈ నెల 15న గుంటూరులోని కొరిటెపాడు ప్రాంతానికి చెందిన దంపతులకు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా తిమ్మాలాపురం గ్రామం విట్లాపురం పంచాయతీకి చెందిన ఐదుగురు వ్యక్తులు ఒక బృందంగా ఏర్పడి, ఒక రాంగ్ కాల్ చేసి తమ వద్ద తవ్వకాల్లో దొరికిన బంగారం ఉందని, తక్కువ రేటుకు విక్రయిస్తామని నమ్మించారు. సుమారు నెల రోజుల పాటు బాధితులతో మాటలు కలిపి మొదటగా అసలైన చిన్న బంగారపు ముక్క ఇచ్చారు. బాధిత దంపతులు వాటిని పరీక్షించుకోగా అసలై బంగారమేనని తేలింది. దీంతో బాధిత దంపతులు వారి మాటలు నమ్మారు. కాగా బాధిత దంపతులను కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి పిలిపించుకుని అక్కడ వారి వద్ద నుండి రూ.12 లక్షల నగదు తీసుకుని వారికి రాగి - జింక్ మిశ్రమంతో కూడిన అర కేజీ నకిలీ బంగారు ముక్కలను ఇచ్చారు. ఇంటికి వచ్చి బాదితులు వాటిని పరీక్షించుకోగా అవి రాగి - జింక్ మిశ్రంతో కూడిన నకిలీ బంగారమని తెలిసి కంగుతిన్నారు. అప్పటికే నిందితులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఆచూకీ అందకుండా పోయారు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసానికి సంబంధించి అరండల్ పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు, ఎస్సై సుబ్బారావు, పోలీస్ సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణ జరుగుతుండగానే వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్టుగా ఈ ముఠా మరొకరిని మోసగించేందుకు యత్నిస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కొరిటెపాడుకు చెందిన బాధిత దంపతులకు తెలిసిన వారినే ఈ ముఠా ఇదే తరహాలో మోసం చేసేందుకు యత్నించింది. వారు ఈ విషయాన్ని బాధిత దంపతులకు చెప్పగా వారి ద్వారా విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో వారి ద్వారా ఈ ముఠాకు పోలీసులు ట్రాప్ వేశారు. వారిని గుంటూరుకు పిలిపించి ఇరువురు నిందితులు జంబునాద్, వెంకటేష్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. ఏడు లక్షల నగదు స్వాదీనం చేసుకున్నారు. నిందితులంతా కర్నాటకలోని విట్లాపురం గ్రామానికి చెందిన ఐదు మంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు ఇరువురు నిందితులు వెల్లడించారు. కాగా మిగిలిన ముగ్గురు నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు డీఎస్పీ అరవింద్ వెల్లడించారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

● నలుగురు బెంగళూరువాసులకు గాయాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో మండల పరిదిలోని చిన్నారుట్ల సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వస్తుండగా, బెంగళూరుకు చెందిన కారు దోర్నాల నుంచి శ్రీశైలం వైపు వెళ్తుండగా చిన్నారుట్ల మూలమలుపు వద్ద ఎదురుపడి ఢీకొన్నాయి. దీంతో కారు ముందుభాగం దెబ్బ తినింది. అందులో ఉన్న రవికుమార్, భాస్కర్, ప్రభావతి, తేజస్విని గాయపడ్డారు. 108లో క్షతగాత్రులను సమీపంలోని సున్నిపెంట వైద్యశాలకు తరలించారు. దోర్నాల పోలీసుస్టేషనుకు ఫిర్యాదు అందడంతో ఎస్సై మహేష్ సిబ్బందితో వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి గురైన కారు

నేడు రాయచూరుకు డీసీఎం



రాయచూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారం రాయచూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10:00 గంటలకు రాయచూరు తాలూకాలోని బిచ్చాలి గ్రామానికి చేరుకుని పూజ కార్యక్రమంలో పల్గొంటారు. 10:30 గంటలకు బిచ్చాలి నుంచి బయలుదేరి, 11 గంటలకు రాయచూరు గ్రామీణ ప్రాంతంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. తరువాత ఉదయం 11:30 గంటలకు పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పంచముఖి నుండి బయలుదేరి మంత్రాలయంకు వెళతారు. సాయంత్రం 6:55 గంటలకు మంత్రాలయం నుంచి రైలులో రాజధాని బెంగళూరుకు వెళ్తారని ఉప ముఖ్యమంత్రి అదనపు ప్రైవేట్ కార్యదర్శ బీఎస్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌరకార్మికులతో దీపావళి

బళ్లారి సిటీ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా గ్రామంలో 'అమ్మసంస్థ' పౌరకార్మికులతో దీపావళి జరుపుకుంది. పౌరకార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి శాలువాలతో ప్రతి ఒక్కనిరీ చీరలు అందజేసి గౌరవించారు. ఈసందర్భంగా అమ్మ సంస్థ ఆఫీస్ బేరర్లు, అధ్యక్షుడు ఎం.కవితరుద్రగౌడ, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎం.ఉద్రగౌడ,సభ్యురాలు ఎస్.రుద్రమ్మ ,పంపాపతి పాల్గొన్నారు.



కార్మికులను సత్కరిస్తున్న 'అమ్మ' సంస్థ ప్రతినిధులు

హోసూరు జోన్



లక్ష్మీ పూజల్లో మహిళలు

ఇంటింటా దీపావళి సందడి

హోసూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బహుభాషా నగరమైన హోసూరులో దీపావళి సంప్రదాయ వేడుకలు సందడిగా సాగాయి. తమిళ, కన్నడ, తెలుగు, మలయాళం సహా వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉన్నారు. పండుగ సందర్భంగా ప్రజలు నూతనవస్త్రాలు ధరించి లక్ష్మీ పూజ చేసుకున్నారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. కొన్నిచోట్ల గౌరిదేవి పూజలు నిర్వహించారు. ఇరుగుపొరుగువారికి మిఠాయిలు పంచిపెట్టారు.

దీపావళితో నగరంలో ట్రాఫిక్‌జామ్

దీపావళి అనంతరం ప్రజలు బెంగళూరుకు వాపసు వస్తున్నందున సరిహద్దు ప్రాంతాలలో ట్రాఫిక్‌జామ్ నెలకొంది. రెండురోజులక్రితం దీపావళి సందర్భంగా బెంగళూరులోని ఐటీ ఉద్యోగులు, ఫ్యాక్టరీల సిబ్బంది పండుగకు తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాతోపాటు కోయంబత్తూరు, తిరుచ్చి, చెన్నై, తిరువణ్ణామలై, సేలం తదితర ప్రాంతాలకు స్వస్థలాలకు వెళ్లారు. పండుగ అనంతరం తిరిగి బెంగళూరుకు వస్తుండడంతో మంగళవారం ట్రాఫిక్‌జామ్ నెలకొంది. జాతీయ రహదారిలోని సిప్‌కాట్ ప్రాంతంలో ఫ్లై ఓవర్‌ను రెండురోజులక్రితం ప్రజల ఉపయోగం కోసం ప్రారంభించారు. ఈఎస్ఐ వద్ద తెరిచిన ఫ్లై ఓవర్ ఇప్పుడు బెంగళూరు నుంచి వచ్చే ప్రాంతంలో బ్లాక్ చేయబడింది. తమిళనాడునుంచి వచ్చే వాహనాలు సరిహద్దులోని అత్తిబెలె టోల్‌గేట్ వద్ద బారులు తీరుతున్నాయి.



ట్రాఫిక్ జామ్‌తో టోల్‌గేట్ వద్ద ఆగిన వాహనాలు

సైనిక్ స్కూల్‌కు అనుమతులు హర్షణీయం

● కళ్యాణ కర్ణాటక జిల్లాలకు ఎంతో ఉపయోగకరం: ఎమ్మెల్యే హంపనగౌడ



సమావేశంలో ఎమ్మెల్యే హంపన గౌడ, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ విరుపాక్షప్ప తదితరులు

బళ్లారి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ ఎడ్యూకేషన్ సంస్థలో సైనిక్ స్కూల్ ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం అనుమతివ్వడం హర్షణీయమని సింధనూరు ఎమ్మెల్యే హంపన గౌడ, మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ విరుపాక్షప్ప అన్నారు. సోమవారం సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ ఎడ్యూకేషన్ సొసైటీ అధ్యక్షుడు బి. వెంకటరావు, ఉపాధ్యక్షుడు జీ. సత్యనారాయణ లతో కలిసి వీరు విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా బి. వెంకటరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషన్ సొసైటీ 1984లో ప్రారంభించారన్నారు. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించామన్నారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం పీపీపీ పద్ధతి ద్వారా వంద సైనిక్ స్కూళ్లు నిర్మించాలని నిర్ణయించిందన్నారు. మైసూరు, బీదర్, సింధనూరు కేంద్రాల్లో ఇవి ప్రారంభం కానున్నాయన్నారు. 120 విద్యార్థులతో సైనిక్ స్కూల్ ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో విద్యార్థినులకు 40 సీట్లు కేటాయించారని మిగిలిన 80 సీట్లు వివిద క్యాటగిరీ కింద భర్తీ చేస్తారన్నారు. ఎమ్మెల్యే హంపన గౌడ మాట్లాడుతూ వెనుక బడిన ఈ ప్రాంతంలో ఇలాంటి స్కూల్ రావడం విద్యార్థుల భవిషత్తు బంగారు బాట వేసినట్లు అవుతుందన్నారు. మాజీ మంత్రి వి. నాడగౌడ మాట్లాడుతూ ఎంతో ముందు చూపుతో 1984లో శ్రీకృష్ణదేవరాయ ఎడ్యూకేషన్ సంస్థను స్థాపనకు 20 ఎకరాల్లో స్థాపంచారన్నారు. ఎవరైనా అభివృద్ధి చెందాలంటే ముందు చూపు ఉండాలన్నారు. మీరు ఎవరూ ఇక్కడకి వచ్చిన వారిని తెలుగువాళ్లు వేరే ఊరి నుంచి వచ్చారు అని అనమని మాజీ మంత్రి నాడగౌడ అన్నారు. అందరినీ స్థానికులుగానే భావిస్తామన్నారు. మాజీ ఎంపీ విరుపాక్షప్ప మాట్లాడుతూ సింధనూరుకు సైనిక్ స్కూల్ మంజూరుకు కేంద్ర మంత్రి హెచ్.డీ కుమారస్వామి, హెచ్.డీ దేవెగౌడ సహకరించారన్నారు. సైనిక్ స్కూల్ నిర్మాణంతో కల్యాణ కర్ణాటక ప్రాంతాలకు ఎంతో మేలన్నారు. వెనుకబడిన జిల్లాలు అయిన బళ్లారి, రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబుర్గి జిల్లాల విద్యార్థులకు ఉపయోగ కరంగా ఉంటుందన్నారు. బి. సుబ్రమణ్యం. కే. సుబ్బారావు, ఎం. వెంకటేశ్వరావు. ఎస్. మురళీ కృష్ణ, నెక్కంటి సురేష్, విశ్వనాత్ చౌదరి. ప్రిన్సిపాల్ నవీన్, వై. సుధాకర్, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులను నేతలు అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఐవాన్ బునిన్ (జయంతి)




రష్యా దేశ ప్రముఖ రచయిత ఐవాన్ బునిన్ 1870 అక్టోబరు 22న జన్మించారు. 'ది లైఫ్ ఆఫ్ అర్సెనివ్' నవలకు నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్న తొలి రష్యా రచయితగా గుర్తింపు పొందారు. ఆయన రాసిన పోయెమ్స్, కథలు విభిన్నంగా ఉంటూ ఆకట్టుకునేలా ఉంటాయి. 1953 నవంబరు 8న కన్నుమూశారు. 2020లో రష్యా ప్రభుత్వం ఐవాన్ బునిన్ 125వ జయంతి సందర్భంగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.

స్వామి రామతీర్థ (జయంతి)



స్వామి రామతీర్థ 1873 అక్టోబరు 22న ప్రస్తుత పాక్ పాలిత పంజాబ్ ప్రాంతంలో జన్మించారు. రామ్ సోమీగా పిలవబడ్డారు. ఉపాధ్యాయుడిగా, హిందూ తత్వవేత్తగా పేరొందారు. స్వామి వివేకానంద తర్వాత అమెరికాలో ఉపన్యాసాలు ఇచ్చిన తొలితరం హిందూమతం ప్రముఖ ఉపాధ్యాయులలో స్వామి రామతీర్థ ఒకరు. అమెరికాలోని భారతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడంలో సాయం చేశాడు. హిందూధర్మాన్ని బోధించడానికి జపాన్ పర్యటనకు టెహ్రీకి చెందిన మహారాజా కీర్తిషా బహదూర్ స్పాన్సర్ చేశారు. 'ఆచరణాత్మక వేదాంత' తత్వశాస్త్రంపై ఉపన్యాసాలు చేశారు. 1906లో ప్రజాజీవితం నుంచి వైదొలగి హిమాలయాల దిగువ ప్రాంతాలకు వెళ్లారు. ఆచరణాత్మక వేదాంతాన్ని క్రమబద్ధంగా ప్రదర్శించే పుస్తకాన్ని రాయడానికి సిద్ధమయ్యాడు. కానీ పూర్తికాకనే 32వ యేట 1906 అక్టోబరు 17న కన్నుమూశారు.

కొమురం భీం (జయంతి)



ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక, అస్తిత్వ ఉద్యమాల వేగుచుక్కగా పేరొందిన కొమురం భీం 1901 అక్టోబరు 22న ఆదిలాబాద్ అడవులలో గోండు ఆదివాసుల కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్ విముక్తికోసం, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా శైలిలో పోరాడారు. అడవిని జీవనోపాధిగా చేసుకుని అన్ని రకాల నిజాం అధికారాలను తోసిపుచ్చాడు. పశువుల కాపరులపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టి 1940 అక్టోబరు 27న వీరమరణం పొందారు.

డోరిస్ లెస్సింగ్ (జయంతి)




ప్రముఖ నవలా రచయిత్రి డోరిస్ లెస్సింగ్ 1919 అక్టోబరు 22న ఇరాన్‌లో జన్మించారు. బ్రిటీష్-జింబాబ్వేయిన్ నావెలిస్టుగా గుర్తింపు పొందారు. 2007లో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని పొందారు. బ్రిటీష్ సాహిత్యంలో డేవిడ్ కోహెన్ ప్రైజ్ అందుకున్నారు. 50కుపైగా నవలలు ప్రచురించింది. టైమ్స్ పత్రిక 2008లో ప్రకటించిన 50 ప్రముఖ బ్రిటీష్ రచయితలు 1945 నుంచి జాబితాలో 5వ ర్యాంకులో నిలిచారు. 'ది గోల్డెన్ నోట్‌బుక్' రచనతో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. 2013 నవంబరు 17న కన్నుమూశారు.

దీపక్ చోప్రా (పుట్టినరోజు)



ఇండియన్-అమెరికన్ రచయిత దీపక్ చోప్రా 1946 అక్టోబరు 22న న్యూఢిల్లీలో జన్మించారు. ఆల్టర్‌నేటివ్ మెడిసిన్‌తో గుర్తింపు పొందారు. మహర్షి మహేశ్‌యోగి స్ఫూర్తితో ఆధ్యాత్మికంగాను రాణించారు. 1996లో 'చోప్రా సెంటర్ ఫర్ వెల్ బీయింగ్' సంస్థను ఏర్పాటు చేసి ఆరోగ్యంపై ప్రజలలో చైతన్యం తెచ్చారు. మెటా ఫిజిక్స్, వేదాంతాలపై ప్రసంగాలు చేయడమే కాక రచనలు చేస్తున్నారు. 2021 నాటికి 91 పుస్తకాలు రాయగా వీటిలో 21 బెస్ట్ సెల్లర్‌గా నిలిచాయి. ఇవి 43 భాషలలోకి అనువాదం అయ్యాయి. ది సెవెన్ స్పిరిచ్యువల్ లాస్ ఆఫ్ సక్సెస్ పుస్తకం న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లెర్ లిస్ట్‌లో 72 వారాలపాటు నిలిచింది.

అమిత్ షా (పుట్టినరోజు)



దేశ రాజకీయాల్లో అపర చాణుక్యుడిగా పేరొందిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా 1964 అక్టోబరు 22న ముంబైలో జన్మించారు. పూర్తి పేరు అమిత్ అనిల్ చంద్ర షా. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా, ఎన్డీయే చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో కీలకంగా ఉన్నారు. ఎమ్మెల్యే స్థాయి నుంచి కేంద్రమంత్రి వరకు వివిధ హోదాలలో తనదైన ప్రత్యేకత చాటుకున్నారు.

బురదరోడ్లతో విద్యార్థులకు అవస్థలు



బురద, గుంతల రోడ్లు ఇలా...



రోడ్డుపై విద్యార్థుల సంచారం ఇలా...

దుస్థితిలో చిక్కదాసేనహళ్ళి నుంచి మారప్పనహళ్ళికి వెళ్లే మార్గం

శిడ్లఘట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలోని చిక్కదాసేనహళ్ళి నుంచి మారప్పనహళ్ళికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో బురదమయంగా మారింది. గ్రామస్థులతోపాటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు. మారప్పనహళ్ళి నుంచి శిడ్లఘట్టకు రావాలంటే సరైన రోడ్డు లేదు. రోడ్డు చాలావరకు కంకరతేలి, గుంతలతోపాటు బురదమయమైంది. రెండేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంవత్సరాలుగా దుస్థితిలో ఉన్న రోడ్డును బాగు చేసేందుకు చొరవ చూపాలని కోరారు.

క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ

» త్రోబాల్ జాతీయస్థాయి పోటీలకు చందన్, అక్షయ్‌లు



క్రీడాకారులకు సత్కారంలో ఉపాధ్యాయులు తదితరులు

దొమ్మసంద్ర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా చక్కటి ఆరోగ్యంతోపాటు విద్యార్థులలో క్రమశిక్షణ సాధ్యమని ఎండీవర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ జీవీ మునీంద్ర అభిప్రాయపడ్డారు. స్కూల్ విద్యార్థులు త్రోబాల్‌లో చందన్, అక్షయ్‌లు తమ ధృడసంకల్పంతో జాతీయస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంపై ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల దేవనహళ్ళి తాలూకా సువర్ణ కర్ణాటక త్రోబాల్ అసోసియేషన్, త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 35వ జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలలో సత్తా చాటుకుని కర్ణాటక నుంచి దేశ ప్రతినిధులుగా చందన్, అక్షయ్‌లు ఎంపికయ్యారు. రాష్ట్ర కోచ్‌గా వ్యవహరించిన గాయత్రి విద్యార్థులను అభినందించారు. మన పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి క్రీడాపోటీలకు కర్ణాటకనుంచి ప్రతినిధులుగా భారతజట్టుకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ సాధన మన పాఠశాలకు, ఆనేకల్ తాలూకాలోని ప్రతి విద్యార్థులకు గౌరవం తెచ్చిందన్నారు. కోచ్ గాయత్రి శ్రమ, మార్గదర్శకం వల్లే విజయం సాధ్యమైందన్నారు. రానున్నరోజుల్లో అంతర్జాతీయ పోటీల్లో మనదేశ త్రివర్ణపతాకం ఎగురవేయనుందని, పాఠశాల పాలకమండలి కూడా విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పాఠశాల ముఖ్యులు డాక్టర్ ఎంఎల్ శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు అపారమైన క్రీడాభిమానం, నిరంతర తర్ఫీదువల్లే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందుజా, మాలా, శ్రీనివాస్, సంతోష్, బాలకృష్ణ, రాజేశ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు స్వాధీనం - ముగ్గురి అరెస్టు

బంగారపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కామసముద్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల చోరీకి సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రూ.1.20లక్షల విలులైన రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 13న అరిమానహళ్ళికి చెందిన మురళి ఇంటి ముందు ఆపిఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడి పిర్యాదు మేరకు కామసముద్ర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఐ నారాయణస్వామి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాకు చెందిన వీ మధు (20), నందీశ్ అలియాస్ మూర్తి (20), కార్తీక్ (23)లను అరెస్టు చేశారు. విచారణలో బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఇటీవల ఒక ద్విచక్రవాహనం చోరీ చేసినట్టు గుర్తించారు. పోలీసు సిబ్బందిని కేజీఎఫ్ జిల్లా ఎస్పీ శివాంశురజపుత్ ప్రశంసించారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

జడ్పీ మాజీ సభ్యుడు కన్నుమూత

బాగేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు జీవీ బాబురెడ్డి (80) సోమవారం కన్నుమూశారు. బాగేపల్లి పట్టణ పంచాయతీకి వరుసగా నాలుగుసార్లు అధ్యక్షుడిగా సేవలందించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆర్‌ఎల్ జాలప్ప, వీ కృష్ణరావ్, బీఎన్ వెంకటస్వామిలతో కలసి కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారు. పట్టణంలోని షిర్డీసాయి సేవానాథ్ ట్రస్టు అధ్యక్షుడిగా వ్యవహరించారు. అనారోగ్యం కారణంగా అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతు తుదిశ్వాస వీడారు. కాగా మృతదేహాన్ని కోలారు ఆర్‌ఎల్ జాలప్ప ఆసుపత్రికి దానంగా ఇస్తున్నట్టు కుటుంబీకులు తెలిపారు. పట్టణంలోని డీవీజీరోడ్డులో అభిమానుల అంతిమం దర్శనంకోసం అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే కేఎన్ సుబ్బారెడ్డి సహ పలువురు సంతాపం వ్యక్తం చేశారు.



బాబురెడ్డి (ఫైల్)

అభివృద్ధి వైపు అడుగులు పడేనా..?

● వైసీపీ హయాంలో ఆగిన అభివృద్ధి పనులు ● చైర్మన్ మార్పుతో గాడిలో పడేనా..?



మారుతీ నగర్‌లో రోడ్డు దుస్థితి

మడకశిర టౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అభివృద్ధివైపు అడుగులు పడేనా అన్న చర్చ పట్టణంలో సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిన అభివృద్ధి నగరపంచాయతీ పీఠం టీడీపీ కైవసం చేసుకోవడంతో గాడిలో పడేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఇంటి నిర్మాణం, కాలనీలో అభివృద్ధి పనులు జరగాలన్నా ముడుపులు ముట్టచెప్పక తప్పేదికాదని అంటున్నారు. ఒక వైపు ఇసుక కొరత మరో వైపు ముడుపులు ముట్ట చెప్పలేక చివరకు ఇంటి నిర్మాణాలు ఆగిపోయాయి. మారుతీనగర్, ఆదిరెడ్డిపాళ్యంతోపాటు పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అయితే మధ్యలో పనులు ఆపడంతో పలు విమర్శలు వచ్చాయి. ముడుపులు ఇవ్వని కారణంగా పనులు ఆగాయని, వచ్చిన నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు పట్టణంలో చర్చ సాగింది. అదేవిధంగా పైపులైన్ పనులు సైతం ఆగిపోయాయి. దీంతో మడకశిర నగర పంచాయతీ అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలు బహిరంగానే వినిపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందడంతో నగర పంచాయతీ పరిస్థితి మారబోతుందని పట్టణవాసులు ఆశలు పెట్టుకొన్నారు. దీనికితోడు ఇటీవల నగర పంచాయతీ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఏయే కాలనీల్లో పనులు ఆగిపోయాయి..? సీసీ రోడ్ల పరిస్థితి ఎక్కడి వరకు వచ్చింది..? తదితర వివరాలను స్థానికుల ద్వారా తీసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్యలను ప్రజలద్వారా తెలుసుకుని వాటి పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారు. ఇప్పటికే పాత కర్ణాటక బ్యాంక్ ప్రాంతంలో బ్రిడ్జ్ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలువురు మంత్రులను కలిసి మడకశిర నగర పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చలు జరిపి నిధులు మంజూరుకు సైతం అంగీకారం పొందినట్లు పలువురు నాయకులు చెబుతున్నారు. దీంతో నగర పంచాయతీ నియోజకవర్గ కేంద్రం కావడంతో ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని వారు అంటున్నారు.

ఆగిన పనులను కొనసాగించేందుకు చర్యలు: ఎమ్మెల్యే

వైసీపీ హయాంలో ఆగిన అభివృద్ధి పనులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నా. ముఖ్యంగా కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ. 3 కోట్లతోటత్వరలో పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. మంత్రి నారాయణ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు త్వరలో పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. గతంలో ఆగిన అభివృద్ధి పనులతోపాటు కొత్తగా నగర పంచాయతీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకొంటున్నాం. భవిష్యత్తులో మారిన మడకశిరను చూడబోతున్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారికి స్వీట్లు, పూలతో అలంకరణ

ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో దీపావళి వేడుకలు

పెనుకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐముక్తేశ్వరస్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అర్చకులు కన్నాస్వామి, మూర్తిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివి ధ రకాల పూలతో అమ్మవారి ని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.





రజతకవచధారణలో వినాయకుడు

కురుడుమలెలో విశేషపూజలు

ముళబాగిలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని తాలూకాలోని కురుడుమలె గ్రామంలోని వినాయక ఆలయంలో మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. పుష్పాలతోపాటు కుడుములతో ప్రత్యేక అలంకరణ చేశారు. అంతకుముందు అభిషేకం చేశారు. రజతకవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు.

10వేలమంది రైతులకు అనుకూలంగా

హోల్‌సేల్ మండి

● దేశవ్యాప్తంగా సేవలకు శ్రీకారం : ఎండీ విక్రమ్‌రమేశ్

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వివిధ జిల్లాల నుంచి 10వేలమంది రైతులకు అనుకూలమయ్యేలా హోల్‌సేల్‌మండిని ప్రారంభిస్తున్నట్టు ఎండీ విక్రమ్‌రమేశ్ ప్రకటించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సాధారణ మార్కెట్ ధరలకంటే 30శాతం తక్కువధరతోనే వినియోగదారులకు అందిస్తామన్నారు. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని బెంగళూరులో తమ సేవలకు శ్రీకారం చుట్టామన్నారు. ఐటీహబ్ బెంగళూరులో తాజా పండ్లు, కూరగాయలను అందించాలన్నదే తమ ఆశయమన్నారు. రైతులు పండించే వస్తువులను నేరుగా సేకరించి వాటిని మార్కెటింగ్ చేస్తామన్నారు. కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు, బెంగళూరు గ్రామీణ జిల్లాల ప్రాంతాలనుంచి సరుకులు సేకరిస్తామన్నారు. ప్యాకేజ్, గ్రేడింగ్ విధానానికి ప్రత్యేక విధానం ఏర్పాటు చేశామని, నాణ్యత పాటిస్తామన్నారు. వైట్‌ఫీల్డ్‌లో పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశామని ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.

యువజంట ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా కల్లుబాళ గ్రామంలో యువజంట ఆత్మహత్యకు పాల్పడింది. వారిని ఒడిశ్శాకు చెందిన సీమానాయక్ (25), రాకేశ్ (23)గా గుర్తించారు. రెండురోజులక్రితం ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. రెండు రోజులుగా తలుపులు తెరవకపోవడంతో అనుమానంతో ఇంటి సమీపంలోని వారు మంగళవారం ఉదయం కిటికీ అద్దాలు పగులగొట్టారు. ఇద్దరూ ఉరివేసుకన్న స్థితిలో కనిపించారు. వెంటనే జిగణి పోలీసులకు సమాచారం అందజేశారు. ఏఎస్పీ వెంకటేశ్ ప్రసన్న తన సిబ్బందితో అక్కడికి చేరకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం వీరిద్దరూ గొడవపడినట్లు స్థానికులు తెలిపారు. వీరు లివింగ్ టు గెదర్‌లో ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. తొలుత రాకేశ్ ఆత్మహత్య చేసుకోగా ఆమెను రక్షించే ప్రయత్నం చేశారని, అయితే ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించుకున్నాక సీమానాయక్ ఉరివేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

యువతి పట్ల అనుచిత ప్రవర్తన

●ఫిర్యాదుతో వైద్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చర్మ ఆరోగ్య సమస్యలతో క్లినిక్‌కు వచ్చిన యువతి పట్ల అనుచితంగా ప్రవర్తించిన వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 56ఏళ్ళ చర్మరోగ వైద్యుడు ప్రవీణ్‌ను సోమవారం అరెస్టు చేశారు. శనివారం 21ఏళ్ల యువతి క్లినిక్‌కు వెళ్లింది. సాధారణంగా యువతితోపాటు ఆమె తండ్రి కూడా వెంట వచ్చేవాడు. ప్రస్తుతం ఒంటరిగా వచ్చిన యువతి పట్ల పరీక్షల పేరిట డాక్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో యువతి అక్కడ నుంచి వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు స్థానికులతో కలసి క్లినిక్‌ను ముట్టడించారు. పోలీసులు అక్కడికి వచ్చి నచ్చచెప్పడంతో నిరసన వీడారు. అయితే డాక్టర్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తాను అందించిన చికిత్సను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. అయితే యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని డాక్టర్‌ను అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తు సాగుతోంది.

దరఖాస్తు చేసుకోండి

పావగడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ గ్రాడ్యుయేషన్ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కును పొందేందుకు ఫారం నెంబరు 18లో నవంబరు 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవి తెలిపారు. నవంబరు 25న తొలి ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. డిసెంబరు 30వ తేదీన ఓటర్‌లిస్ట్‌ను గ్రాడ్యుయేషన్ వ్యక్తులకు అందజేస్తామని ఆయన తెలిపారు. తుమకూరు, చిత్రదుర్గం, దావణగెరె, కోలార్, చిక్కబళ్లాపురం జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు ఓటు హక్కు కోసం దరఖాస్తుచేసుకోవాలన్నారు.

బాల్యంలోనే నైతిక విలువలు నేర్పాలి

లిటిల్ ఏంజెల్స్ వ్యవస్థాపకురాలు ధనలక్ష్మి సురేశ్‌బాబు

బెంగళూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్యంలోనే నైతిక విలువలు నేర్పాలని అప్పుడే మన సంస్కృతి సంప్రదాయంతోపాటు విద్యార్థులలో గౌరవం, మర్యాదలు అలవడతాయని లిటిల్ ఏంజెల్స్ వ్యవస్థాపకురాలు ధనలక్ష్మి సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. పాఠశాల 27వ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యారణ్యపుర, దొడ్డబొమ్మసంద్ర ప్రాంతాలలో అపూర్వశిక్షణా ట్రస్టు పేరిట సంస్థలను ఏర్పాటు చేశామన్నారు. 27 ఏళ్లుగా విద్యార్థులలో కొత్త ఆలోచనలు రేకెత్తింపచేసేలా బోధనలు అందిస్తున్నామన్నారు. నైపుణ్యత, స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి అందరూ మహిళా ఉద్యోగులు, టీచర్లు ఉన్నారన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.